# దివాన్‌జీగారి ముసాఫరు

'కరుణకుమార'

చెంచయ్య తనతండ్రి కొక్కడే కొడుకు. చాలా బీదసంసారం. గ్రామంలో శూద్ర ఇళ్ల పౌరోహిత్యంతప్ప తండ్రికి మరొక జీవనాధారం లేదు. ఇట్లాగైనా తనకొడుకు నాలు గింగ్లీషుముక్కలు చదువుకొని, ఏ చిన్నదో పెద్దదో సర్కారుఉద్యోగం చేస్తూ వుండగా చూచి ఆనందించాలని తండ్రి ఎంతో ముచ్చటపడ్డాడు. కాని చెంచయ్య థర్డుఫారం పూర్తిచేయడమే కష్టమైపోయింది. రెండుసారులు తప్పి అతను మూడోసారి కష్టపడి చదివి థర్డుఫారం పరీక్ష ప్యాసయినాడు. ఇక చదువు చెప్పించడం తండ్రికి కష్టమైనందున అతను స్కూలు విడిచిపెట్టి ఉద్యోగంకోసం ప్రయత్నించడం మొదలుపెట్టాడు కాని ఎక్కడాకూడా నౌకరీ దొరకలేదు. చదువే అట్టే లేదయ్యె; పైగా బ్రాహ్మణుడు. అందువల్ల సర్కారు నౌకరీకి ఆశ వదలుకొని ఏ ఎస్టేటుఇలాకా నౌకరీఅయినా సంపాదించుకొందామని కాళ్లు పడిపోయేటట్టు తిరిగితిరిగి వారినీ వీరినీ ఆశ్రయించి తుదకు దొడ్డిగుంట ఎస్టేటులో చేరిన కోణంగితాణాలో నెలకు పదిహేనురూపాయల జీతంమీద గుమాస్తాగా ప్రవేశించాడు. ఆతాణాలో పదిపదకొండునెలలు పనిచేసినతర్వాత కాస్తోకూస్తో ఇంగ్లీషు చదువుకొన్నవాడవడంవల్లనూ, అంతకంటెనూ ఆశ్రయింపు బాగా చేతనవడంవల్లనూ అతనికి ఎస్టేటువారు ప్రమోషణ్ ఇస్తూ నెల కిరవైరూపాయల జీతంమీద ములుమూడిముఠా గ్రామాలకు సముద్దారుగా వేశారు.

జమీన్‌దారీ ఇలాకాల్లో సముద్దారంటే రెవిన్యూ ఇన్‌స్పెక్టరన్నమాట. చెంచయ్య ములుమూడిలో ఛార్జీతీసుకొన్న నాలుగు నెలలకు ఎస్టేటుదివాన్‌జీగారు ఆగ్రామంలో మూడురోజులు మకాం చేయబోతున్నారనీ, జూన్ నెల ఆరోతేది సాయంత్రం అయిదు గంటలకు గ్రామం విజయంచేస్తారనీ, వారి బసకు తగిన ఏర్పాట్లు చేస్తూ, గ్రామచావడి ముందు పందిరీ, వంటకు ప్రత్యేకం వసారా, మోటారు పెట్టుకోడానికి షెడ్డూ, స్నానాల గదీ, పాయిఖానాదొడ్డీ — వీటిని కట్టించి దివాన్‌జీగారికి తగిన సదుపాయాలు ఏర్పాటు చేయవలసిందనీ తాణాదారుదగ్గరనుంచి సముద్దారుకు జూన్ నెల **3**-వ తేది మధ్యాహ్నం రెండుగంటలకు తాఖీదు వచ్చింది.

దివాన్‌జీగారు అంత అర్జంటుగా ఆ గ్రామం ఎందుకు మకాంచేస్తున్నారో చెంచయ్యకు తెలియదు. ఆయన సర్కారులో డిప్టీకలెక్టరుగా ఉండి నిప్పులు కురిపించాడని ఆయనకు పెద్దపేరు. పేరు నారాయణరావు. నియోగిబ్రాహ్మణుడు; మంచిముసద్దీ; వరదీసినకత్తి. సవ్యసాచివంటివాడు. సర్కారులో డిప్టీకలెక్టరుగా ఉండంగా ఫిర్యాదికీ ముద్దాయికీకూడా అనుకూలంగా — ఎటు బేరం మొగ్గితే అటు తనచిత్తం వచ్చినట్లు — ఒకకేసులోనే రెండు జడ్జిమెంట్లు తిప్పి

వ్రాయగల నేర్పు కలిగి రెండుచేతులతోనూ ఎడాపెడాకూడా సంపాదించిన చెయ్యి అని ఆయనగారికి ప్రతీతి. ఎస్టేటుపరిపాలనాపద్ధతిని చక్కబరచడానికి రాజాగారు ఈమధ్యనే ఆయనవిషయమై సర్కారులో స్వయంగా ప్రయత్నంచేసి, నెలకు ఎనిమిదివందల రూపాయల జీతంమీద ఏరి కోరి తెచ్చుకొన్న మనిషి. ఎస్టేటు అంతా సర్వాధికారాలతో ఆయనచేతిలో పెట్టి రాజాగారితరపనులమీద తిరుగుతున్నారు. ఆయన పీఠం అధిష్ఠించింది లగాయతు పిడుగులు కురిపిస్తున్నాడు. నిద్రపోతూఉన్న జమీన్దారీ తాబేదార్లందరికీ ఆయనపేరంటే సింహస్వప్నం అయింది. గడగడ లాడుతోంది ఎస్టేటంతా!

అట్లాంటి దివాన్జీగారు తన హెడ్క్వార్టరు గ్రామంలో మూడురోజులు మకాం చేయబోతున్నారని సముద్దారుపేర తాఖీదు వచ్చేవరకు అసలే కొత్తసేద్యం అయినందువల్ల చెంచయ్యకు గుండె బేజారయింది. దివాన్జీగా రెక్కడ మకాంచేసినా రాజాగారికంటెకూడా అదనంగా సప్లయిలూ, మర్యాదలూ జరగవలసినట్టున్నూ, ఏమాత్రం లోపం జరిగినా ఆయన సహించుకొనేఘటం కానట్టున్నూ, సర్కారులో ఉండంగా ఆయన ఆప్రకారం జరుపుకొన్నట్టున్నూ — ఇట్లాంటిపుకారులు ఎన్నెన్నో అంతకుముందే ఎస్టేటులో బయలుదేరినవి.

చెంచయ్య కొత్తవాడు. ఇట్లాంటి మర్యాద లనుభవంలేదు. ఎప్పుడూ తాను చూడనూలేదు; చెయ్యనూలేదు. ఇంకా తన మజ్జీ గ్రామాధికార్లకూ, గ్రామాధికార్ల మజ్జీ తనకూ బాగా తెలియనేలేదు. ఒక ముఠాకంతా అధికారికాబట్టి, దివాన్జీగారి సప్లయిడ్యూటీ యావత్తూ సముద్దారు నెత్తినే తోసి రాణాదారు ఎస్టేటు శిస్తుబకాయిలు వసూలుచేసే అర్జంటుపనిమీద దక్షిణపు పల్లెలలో తిరుగుతున్నాడు.

దివాన్జీగారి ముసాఫరుకు చేయవలసిన పనులు చాలా ఉన్నవి. పందిళ్లూ, పాకలూ వేయించడానికి ఎంతోసామాను కావలసిఉండె! మనుష్యులు కావలసిఉండె! డబ్బు కావలసిఉండె! ఆవూరు మునసబు బలవంతుడే కాని పట్టి కొరకరాని కొయ్య. గవర్నమెంటు అధికార్లనేకాని జమీన్దారీ అధికార్లంటే ఆతట్టు కన్నెత్తికూడా చూచే రకం కాదు అతడు. తన హెడ్క్వార్టరు గ్రామానికి క్రొత్తగా సముద్దారు వచ్చి నాలుగునెల లయినప్పటికీ, గ్రామంలో ఉన్నాడా, తిన్నాడా, చేశాడా అని ఇంతవరకు ఆమునసబు విచారించిన పాపాన్ని పోలేదు. అతడు ఖాయంమునసబు కాదట కూడాను. అతని పెత్తండ్రి మనుమడు రిజిస్టర్డు మైనరుగా ఉంటే, అతనిమైనార్టీలో ఇతడు మైనరుతరఫున వత్తాసిమునసబుగా పనిచేస్తున్నాడట. ఇప్పుడు ఖాయంమునసబు (పిల్లవాడు) మైనార్టీ తీరి మేజరయి ఇవ్వాళో రేపో తననౌకరీ తాను తన్నుకుపోవాలని ఉన్నాడట! అందువల్ల మునసబుకు నౌకరీమీద నిర్లక్ష్య మైపోయింది. ఎంతసేపూ తన సేద్యమేమో, తన నాద్యమేమో, వ్యవహారాలేమో — వాటితోనే సరిపోతోంది కాని ఇక రెండోప్రమేయం అతగాడికి కాబట్టలేదు. అతగాడు నడుంకట్టి నిలబడితే తలపెట్టిన పనులన్నీ క్షణంలో కాగలవు; కాని సముద్దారుగారి కింతవర కాయనదర్శనమే

లేకపోయె! కరణం ఉన్నాడు కాని అతడు కొత్తవాడు. ఏడాదికిందటనే ఛార్జి తీసుకొన్నాడు. గ్రామంలో ఇంకా పలుకుబడి కలగలేదు.

దివాన్‌జీగారు రావడానికి ఇక రెండు రోజులే గడు వుంది. ఈలోపల పందిళ్లు, పాకలు చాలా తయారుకావలసివుంది. సముద్దారు కేమీ పాలుపోకుండా ఉంది. కరణాన్ని పిలిపించి సంప్రతించాడు. “మునసబును పిలిపించి ఘట్టిగా చెప్పండీ! దివాణం వారి సొమ్ము తింటూ ఎవరికోసంచేస్తాడు సప్లయిలు — ఆయన అట్లా పై ఆటలాడుతూ ఉంటే మధ్య మీకూ నాకూ ఎందుకీ దొర్లాట? చెప్పి పంపండి ఆయనగారికి. ఆయన ఇల్లు కదలకపోతే రిపోర్టుచేయండి ఠాణాదారుగారికి” అన్నాడు కరణం.

కరణంవల్ల ఉపయోగం ఉండేటట్టు కనపడలేదు సముద్దారుకు. అయినా అధికారుల సప్లయిడ్యూటీ మునసబుదే కాబట్టి “నే నొకసారి పిలుస్తున్నానని మునసబునిట్లా పిలుచుకొనిరావోయి” అని తన జవానుని పంపాడు సముద్దారు. “మునసబుగారు మిరపచేనుకు నీరుకట్టిస్తున్నారు; ఇంటికాడ లే”రని పోయిన జవాను చక్కావచ్చాడు. ఇక వ్యవహారం కాగితంమీదపెట్టి నడిపితేనే కాని వీల్లేదని వెంటనే

ములుమూడిముతా సముద్దారువద్దనుండి
ములుమూడి గ్రామమునసబుకు.

తాఖీదు

ఈనెల ౬-వ తేది సాయంత్రం ఆరుగంటలకు శ్రీ శ్రీ శ్రీ దివాన్‌జీదొరగారు ఈగ్రామానికి విజయం చేయబోతున్నారు. కాబట్టి ఈతాఖీదు చూచినవెంటనే మీరు నాయెదుట హాజరై శ్రీవారి ముసాఫరుకు తగిన యేర్పాట్లన్నీ చేయవలెను. అర్జంటు. ఇందుకు తప్పిన యెడల మీసంజాయిషీతో అవసరం లేకుండనే మీ మీద చర్య పుచ్చుకోవడ మవును.

(సం.) చెంచయ్య,
సముద్దారు.

అని ఒక తాఖీదువ్రాసి మునసబు ఎక్కడ వుంటే అక్కడకు తీసుకువెళ్లి ఇచ్చిరమ్మని జవానుచేతి కిచ్చాడు.

“మునసబుగారు చదువుకొని, తాఖీదు తీసుకోవడం లేదన్నా”రని జవాను వాపసు వచ్చి సముద్దారుతో చెప్పాడు.

చెంచయ్యకు ఆగ్రహం ఒకవంకా, భయం ఒకవంకా బయలుదేరినవి. అధికారి యెడల మునసబుచేసిన అవిధేయతకు తాను పైవారికి రిపోర్టుచేస్తే చెయ్యవచ్చు. కాని ముందు దివాన్‌జీగారికి జరగవలసిన కర్మకాండ యావత్తూ జరగవలె. అదిగాక, తీరా రిపోర్టుచేస్తే సంగతి దివాన్‌జీగారికి తెలిసి, ఒకముతాకు సముద్దారుగా ఉండి తా నింత మాత్రం సప్లయిలు చేయలేక మునసబుతో తగవుపెట్టుకొన్నాడని తనవిషయమై దివాన్‌జీగారు అపోహపడతారేమో అని చెంచయ్యకు జంకయింది. ఇక మునసబు ప్రస్తావన పెట్టుకొంటే అసలు వ్యవహారానికి చిక్కురావడమే కాకుండా, అతనితో అనవసరమయిన విరోధానికి కారణ మవుతుందని ఆప్రయత్నం విరమించుకొని, మునసబుకు వ్రాసిపంపిన తాఖీదు చింపివేశాడు.

కరణాన్నీ, జవానునీ పిలిపించి, ‘ఏం చేదా మిప్పు’డని చెంచయ్య వాళ్లిద్దరినీ సలహా అడిగాడు. “చేసే దేముంది? ఆమునసబుమీద ఆశపెట్టుకొంటే కార్యంలేదు. ఇక

మీకు తప్పేదికాదిది. గ్రామంలో నలుగురురైతులనూ పిలిచి వాళ్లదగ్గర తాటిదబ్బలేమైనా ఎరువిస్తారేమో అడగండి. వాళ్లవద్ద సామాను చిక్కితే చిక్కినట్టూ, చిక్కకుంటే అసలు మినహాలోనైనా మనం పది తాళ్లు పడగొట్టించి పని జరిపించాలెకదా" అన్నారు కరణమూ, జవానూను. సరేనని గ్రామంలోని నలుగురు రైతులనూ పిలిపించి అడిగాడు సముద్దారు. "ఈవూరుకు మునసబు లేడా యేమిటి పంతులూ" అని ఒకరూ, "దివాణంసొమ్ము తేరగా తింటూ, ఆయనగారు స్వంతపనులు చూచుకొంటూఉంటే, ఈపను లెవరుచేస్తా డనుకొన్నా డాపెద్దమనిషి?" అని ఇంకొకరూ, "ఈమునసబు పనికిరాడని నిలుపుదల చేయించండి తమరు. నే నొక్కణ్ణే తెల్లవారేవరకు గ్రామంఅంతా పందిళ్లు వేయించి, సిద్ధంచేస్తానో లేదో చూతురుగాని" అని మరొకరూ సమాధానాలు చెప్పి 'శలవుపుచ్చుకొంటాం' అని దణ్ణంపెట్టి ఎవరిదారిన వారు వెళ్లారు.

చెంచయ్యకు గత్యంతరం తోచడం లేదు. రైతులవల్లకూడా జరిగేనహాయం కనిపించలేదు. దివాంజీగారు రాక్షసముండావాడని వినికిడి. తలవెంట్రుకవాసికూడా మర్యాదలకు లోపం రాకూడదని అంతా అంటున్నారు. ఆయనగారు సర్కారులో పెద్ద అధికారాలు చెలాయించి పేరుపడ్డవాడనీ, రావడంతోనే ఆయనకు మెడలో పూలమాల వేసి, పండ్లూ, ఫలాలూ వగైరాలు వాకిట్లోనే సమర్పించి ఎన్నో రాజోపచారాలు చేస్తేనేగాని అసలు మోటారే దిగడనీ, ఇట్లాంటివదంతులు చాలా బయలుదేరినవి. వ్యవహారానికి విఘ్నేశ్వరపూజ వద్దనే విఘ్నం అయింది. ఆయనకు మనస్సులో భీతి ఎక్కువయింది. ఆరాత్రి తెల్లవార్లూ ఆయనకు నిద్రపట్టలేదు.

తెల్లవారింది. మనిషి కొంత ధైర్యం తెచ్చుకొన్నాడు. మూడునెలలజీతం ఈ సప్లయిలకింద ఖర్చుపెట్టాలని నిశ్చయపరుచుకొన్నాడు. "పోనీ! అయితే అయింది. ఆ దివాంజీగారుకూడా బ్రాహ్మణుడే కాని మాలవాడు కాడు కదా! ఒక బ్రాహ్మణ కార్యానికై ఖర్చుపెట్టానని అనుకొంటాను. అదైనా కలిసొస్తుంది." అని ఒకవిధమైన తీర్మానానికి వచ్చి తెల్లవారి బారెడుపొద్దెక్కంగనే ఆగ్రామవెట్టివాళ్లను ముగ్గురినీ, ఇంకా ముగ్గురు కూలీలనూ పెట్టి మధ్యాహ్నానికి చెరువుకట్టమీద చెట్లల్లో పదితాడిచెట్లు పడగొట్టించి సాయంత్రానికి బద్దలు చెక్కించి, రెండుబళ్ల ఆకు కొట్టించి. మడతొక్కించాడు. చీకటిపడేవరకు సామాను యావత్తూ సిద్ధపరిపించాడు. ఆమరునాడు పదిమంది కూలీలను పెట్టించి, ఠాణాదారుగారి ఉత్తరువుప్రకారం పందిళ్లూ, పాకలూ యావత్తూ — ఒక పాతికరూపాయలు ఖర్చుపెట్టి తయారుచేయించాడు. ఆమరునాడు ఉదయాన్నే తన జవానుని నగరం పంపి దివాంజీగారికి ఒకటోరకమైన ఒక గులాబీ పూలమాలా, ఒక 'బొకే', ఒకడజను ఆపిల్సూ, రెండుడజనులు కమలాలూ, ఒకటిన్నరడజను బత్తాయిలూ, నాలుగు దానిమ్మపండ్లూ — అంతా పదిరూపాయలు ఖర్చుపెట్టి అట్టహాసంగా బుట్టతో బుట్టెడు తెప్పించాడు. సాయంత్రం అయిదుగంటలకు సర్వమూ తయారయింది. పొయ్యిలోకి కట్టెలూ, నీళ్లుపోసుకోను కొత్తకుండలూ, స్నానానికి

గిల్లూ, కుమ్మర్లూ, చాకర్లూ తయారుగా వున్నారు. ఇక దివాన్‌జీగారు రావడమే తరువాయి.

ఇంతలో దివాన్‌జీగారి వంటబ్రాహ్మణుడూ, సప్లయిజవానూ వంటసామానుతోనూ, దొరగారి కాంపుసామానుతోనూ ఒంటెద్దుబండిలో ముందుగా ములుమూడికి చేరుకొన్నారు. సప్లయిజవాను దొరగారికి చేయబడిన ఏర్పాట్లన్నీ తణిఖీచేసి, "అన్నీ బాగానే ఉన్నవి కాని వంటవసారామాత్రం వారి ఆఫీసుకు సమీపంలో ఉండడానికి వీల్లేదు. పొగ తగిలితే దొరగారు కోపం చేస్తారు. అందువల్ల వంటకు మరోకచోట ఏర్పాటుచేయవలసిం" దని ఒక సవరణ తీసుకువచ్చాడు. దొరగారిదగ్గర ఖుద్దున ఉండి, ముసాఫరులో వారితోకూడా తిరిగే సప్లయిజవాను ఉత్తరువు దొరగారి ఉత్తరువుతో సమానమైనదే! వేసిన వంటవసారా పెరికించి సాయంత్రములోపల మరోకచోట వేయించడానికి వీలు లేక రెండుఫర్లాంగుల దూరంలో తూర్పువీథిన ఉన్న కరణంగారి యింటి దక్షిణపువసారాలో వంట కేర్పాటు చేసి, టిఫ్ఫిన్‌కారీయరులోపెట్టి దొరగారికి భోజనం తీసుకువెళ్లేటట్టు ఏర్పాటు చేసుకొన్నారు. వంటసామాను యావత్తూ కరణంగారి ఇంటిదగ్గర చేర్పించి పొద్దుకూకినతరువాత వంటబ్రాహ్మణుడు తన సామాను విప్పి వంటప్రయత్నంలో వున్నాడు.

దివాన్‌జీగారు ఏడుగంటలకు మోటారుకారులో వస్తారని జవాను సముద్దారుతో చెప్పి, ఆయన తెప్పించిన పూలమాలా, పండ్లూ చూచి చాలా బాగున్నవనీ, దొరగారు చాలా సంతోషిస్తారనీ మెచ్చుకొన్నాడు. సముద్దారుకు సంతోషం అయి, "దొరగారి మెడలో ముందుగా పూలమాల వేసినతరువాత 'బొఖే' చేతిలో పెట్టవలెనా, లేక ముందు 'బొఖే' చేతి కిచ్చినతరువాత మెడలో మాల వేయవలెనా?" అని సప్లయిజవాను నడిగాడు.

"ముందు మెడలో మాలవేసిన తరువాతనే 'బొఖే' చేతిలో పెట్టం" డన్నాడు సప్లయిజవాను.

"సరే. అయితే దొరగారి కీమర్యాదలు మోటారులో ఉండంగనే చేయవలెనా లేక మోటారు దిగి చావడిలోకి వచ్చినతరువాత చెయ్యవచ్చునా?" అని తాను ఈ తంతు తెలియని కొత్తవాడవడంవల్ల పదిచోట్లా దొరగారితో తిరిగే సప్లయిజవానుని మళ్లా అడిగాడు.

"దొరగారికి మర్యాదలన్నీ మోటారులోనే జరిగించాలె. దిగినతరువాత చేస్తే బాగుండదు. కాబట్టి మోటారు రావడంతోనే మెడలో మాలవేసి, చేతికి 'బొఖే' ఇచ్చి, పండ్లబుట్టను మోటారులో పెట్టండి. వెనక డ్రయివరు వాటి నెత్తుకొని వస్తాడు' అని జవాను తెలియపరిచాడు.

"సరే. మనదొరగారిది ఇంగ్లీషుపద్ధతా లేక హిందూపద్ధతా" అని సముద్దారు మళ్లా ప్రశ్నించాడు.

"అబ్బో! ఆయన ఇంగ్లీషువాళ్లకంటె ఇంగ్లీషుపద్ధతిలో ఉంటారు పంతులూ! దొర టోపీ, సూటూ, బూటూ — అంతా తెల్ల దొరమాదిరే. మోటారుకూడా స్వయంగానే నడుపుతారు. డ్రయివరు వెనుక ఊరి

కనే కూర్చోవలసిందే," అని సప్లయిజవాను జవాబు చెప్పాడు.

సాయంత్రం ఏడుగంట లయింది. చీకటి పడింది. తలకు పాగా చుట్టుకొని, కోటు తొడుక్కొని ఎదురుతెన్నులు చూస్తున్నాడు సముద్దారు. గులాబిపూలదండా, పండ్లూ రెండుబుట్టలలో పెట్టుకొని, దివాణంవారు సప్లయిచేసిన డవాలు తగిలించుకొని నడుముకు గుడ్డకట్టి నెత్తికి పాగాచుట్టి సముద్దారుగారి జవాను సిద్ధంగా ఉన్నాడు. కరణము కూడా తగురీతిని తయారుగా ఉన్నాడు. సప్లయిజవాను చేత లాంతరు పట్టుకొని వాండ్లపక్కనే నిలబడి ఉన్నాడు. చీకటి దట్టమయింది. కొంచెం మబ్బు లేచింది. నక్షత్రాలు కనిపించడం లేదు. వెన్నెల ఇంకా రాలేదు. ఏడున్నర దాటింది, గ్రామ చావడిలో ఇంకోలాంతరు వెలిగించి బయట రోడ్డుమీద పైసిబ్బంది యావత్తూ మోటారు కెదురుచూస్తూ నిలబడిఉంది.

మునసబు ఆతట్టుకూడా మెదలలేదు. సముద్దారుగారే స్వయంగా సప్లయిలు చూచుకొంటున్నాడని తెలిసి "నెత్తిన పాలు పోశాడు — మహారాజు" అని అనుకొంటున్నాడు. దివాన్జీగారు వచ్చినవెంటనే తనకు తెలుపవలసినదని వెట్టివాడితో చెప్పి, గ్రామ మునసబు భోజనం చేసుకొని చుట్ట కాల్చుకొంటూ తనయింటికాడనే కూర్చున్నాడు.

గ్రామచావడి ఉత్తరపు గమిడిలో గ్రామానికి సంబంధం లేకుండా ఎడంగా ఉన్నది. రాత్రి ఎనిమిది కావచ్చింది. దొరగారింకా రాలేదు. ఆయనకొర కెదురు చూస్తూవుండగా, చాకలివాడొకడు పరుగున వచ్చి, "వంటబ్రాహ్మడికి తేలుకుట్టింది; సప్లయి జవానుని అర్జంటుగా పిలుచుకొని రమ్మన్నా" డని చెప్పాడు. "అయ్యో! పాపం! సమయానికి తే లెక్కడనుంచి వచ్చిందో! నేను పోయి విచారించి ఇప్పుడే వస్తాను — కాని మీరుమాత్రం దొరగారు వచ్చేసరికి తయారుగా ఉండండి. మోటారు చప్పుడు వినబడడంతోనే పేరెం తీసి వస్తాను" అని చెప్పుతూ, సప్లయిజవాను వెంటనే చాకలివాడితోకూడా వంటబ్రాహ్మణుడి దగ్గరకు పోయాడు.

ఇంక కొంచెంసేపటికి ఉత్తరంనుండి రోడ్డుమీద మోటారువెలుతురు కనబడింది. "దొరగారు వస్తున్నారు, వస్తున్నా" రని సిబ్బంది యావత్తూ లేచి నిలబడింది. గ్రామ తలారి చేతిదండకు ఇత్తడిబిళ్ల కట్టుకొని, చేతికర్ర పట్టుకొని, తలకు పాగా చుట్టుకొని, మోటారు సమీపంలోనికి రాంగనే నిలపవలసిందని డ్రయివరుకు తెలిసేలాగున, రోడ్డుకు అడ్డంగా చెయ్యెత్తి నిలబడిఉన్నాడు. బుట్టలో పూలమాల నలిగిపోకుండా రెండు చేతులతోనూ పైకి తీసి, 'బొఖే'ను కరణంచేతి కందిచ్చి, అడిగిన వెంటనే తన కివ్వవలసిందని చెప్పి, తన కుడిప్రక్కన ఆయన్ని నిలబెట్టుకొని సముద్దారు తలారివానికి సమీపంలో రోడ్డుకు పడమటితట్టు నిలబడివున్నాడు. సప్లయిజవాను చెప్పిన సంగతులు మరచిపోకుండా మనస్సులో మననం చేసుకొంటూ, దివాన్జీగారికి చేయవలసిన పూజావిధానం మీద దృష్టి నిలిపి, ఒకవిధమైన ఆత్రంతోనూ, ఖంగారుతోనూ, తడబాటుతోనూ సముద్దారు మోటారు వచ్చేవైపు చూస్తున్నాడు.

ఇంతలో ఎప్పుడు వచ్చిందో దూరంలో కనబడిన మోటారుదీపం సమీపంలోకి వచ్చింది. ఆ మోటారులైట్ల మసకవెలుతురులో చూచి "దొరగారే, దొరగారే" అంటూ అందరూ నెమ్మదిగా, సర్దుకొన్నారు. మోటారులైట్ల కాంతిచేత రోడ్డుమీద నిలబడివున్న జనానికి కళ్లు చీకట్లు కమ్ముతున్నవి. మోటారు తలారివానిదగ్గరకు వచ్చి నిలబడింది. నెత్తిన దొరటోపీ. మెడలో నల్లనినెక్‌టై, తెల్లనికాలరూ, ఓపెన్ కోటూ, సూటూ, కళ్లకద్దాలూ వేసుకొని ఒకాయన మోటారు నడిపేచక్రం పట్టుకొని కూర్చున్నాడు. దృష్టిని బలవంతాన సరిచేసుకొంటూ సముద్దారు ఆయన్ని చూచి, "దొరగారు స్వయంగా మోటారు నడుపుకొని వచ్చా" రనుకొంటూ తడబడుతూ, ఆ ఖంగారుతోనే ఆ దొరగారి మెడలో పూలమాల వేయడానికి రెండుచేతులూ పైకెత్తాడు. ఈ సన్మానోత్సవానికి మంగళవాయిద్యంలాగ నిలబడివున్న మోటారుఇంజన్ డబడబా కొట్టుకొంటున్నది. ఆదొర నెత్తిమీది టోపీ తీసి తల ముందుకు వంచాడు. వెంటనే సముద్దారు ఆమనిషి మెడలో పూలహారం వేసి, కరణంచేతిలోని 'బొఖే' ఆయనచేతిలో ఉంచి 'నమస్కారం' అని రెండుచేతులూ జోడించి నమస్కరించాడు. మోటారులోని దొరగారు "థాంక్స్" అన్నట్టుగా చెంచయ్య చెవికి వినవచ్చింది. దివాన్‌జీగారు ప్రసన్నులైనారని సముద్దారు సంతోషించి, వెంటనే జవానుచేతిలోని పండ్లబుట్ట తాను అందుకొని మోటారులో పెట్టాడు. దొరగారి వెనక మోటారులో కూర్చున్న మనిషి బుట్ట నందుకొని పక్కగా పెట్టుకొన్న మీదట దొరగారు "మెనీ థాంక్స్; గుడ్‌నైట్" అంటూ కుడికాలుతో గియర్ బాక్స్ తొక్కి, ఫుట్ బ్రేక్ విడిపించి, ఫస్టుగియర్ మీద మోటారును ముందుకు సాగించి, సెకండ్ గియర్ మార్చుకొని, అంతా అర నిముషంలో టాప్ గియర్ మీద స్పీడెక్కించి, కనురెప్పపాటులో సిబ్బంది అంతా రిచ్చవడి చూస్తూ ఉండగా — దక్షిణముఖంగా పలాయనం చిత్తగించి మాయమైనాడు.

రోడ్డుమీది జనానికి కేమీ అర్థం కాలేదు. అంతా నిర్ఘాంతపోయి ఒకరిముఖం ఒకరు చూచుకొంటున్నారు. "దొరగారికి ఆగ్రహం వచ్చి వెళ్లిపోలేదుకద" అని అనుమానం పుట్టి సముద్దారు "సప్లయిజవా నేడీ" అని కరణాన్ని అడిగాడు, "వంటబ్రాహ్మణుడు పిలిస్తే వెళ్లాడు. అత డింకా రాలే" దన్నాడు తలారి. ఈదొరగారు దివాన్‌జీగారవునా కాదా అని అనుమానాలు పుట్టినవి. "ఈయన దివాన్‌జీగారు కారేమోనండి" అన్నాడు కరణం. "కారేమోనండీ" అన్నారు మరొకరు. దివాన్‌జీగారు ఎస్టేటుఛార్జి పుచ్చుకొన్న తరువాత ఇదే మొదటిమారు రావడం ములుమూడికి. అందుచేత దివాన్‌జీగారిని చూచినవా రెవ్వరూ లేరు — అంతా వారినిగురించి విన్నవారేకాని. "దివాన్‌జీగారు కాకుంటే మనం ఇచ్చినపళ్లు తీసుకొంటాడా ?" అన్నాడు సముద్దారు. "ఎందుకు తీసుకొంటా" రన్నారు ఇంకొకరు. "తీసుకోవడాని కేం" అన్నారు వేఱొకరు. "దివాన్‌జీగా రయితే మోటారు స్వయంగా నపుడుతారా" అన్నాడు కరణం. "ఇప్ప డిది అందరికీ ఫేషన్" అన్నాడు సముద్దారు.

సముద్దారుగారి జవాను పాతవాడు — ముసల్మాన్ బిడ్డ. దివాన్‌జీగారిని కాని, వారి మోటారును కాని యిదివర కతడు చూడ లేదు. కాని పల్లిచ్చినతరవాతకూడా మోటారుదిగకుండా లోపలిమనిషి మోటారు స్టార్టు చేసేవరకు అతగాడి కనుమానంవేసి అప్పటినుంచీ దానిని పరకాయించి చూస్తు న్నాడు. ఇంతలో హఠాత్తుగా స్ఫురణకు వచ్చి "అయ్యయ్యో! ఎంతపని చేశారు పంతులూ! నా కిప్పుడు జ్ఞాపకంవచ్చింది. ఈ మోటారు లైఫ్ ఇన్స్యూరెన్సు కంపెనీ యేజెంటు నరసింహారావు నాయుడుగారిది స్వామీ!" అన్నాడు జవాను.

మోటారుహారన్ చప్పుడు విని దొర గారి సప్లయిజవాను దొరగారు వచ్చారు కాబోలునని గుండెలు గంవుకొంటూ పరుగుతో వచ్చేవరకు దిగ్భ్రాంతుడై కొయ్యబొమ్మలా నిలబడివున్నాడు సముద్దారు చెంచయ్యపంతులు.

